సాక్షి రంగారెడ్డి

శనివారం। 16। నవంబర్। 2024



గిరిజన అభ్యున్నతికి కృషి

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 10లో▸



వ్యతిరేకం కాదు

మూసీ పునరుజ్జీవానికి వ్యతిరేకం కాదని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. 10లో▸



ఆ చట్టాలను రద్దు చేయాలి

రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి డిమాండ్ చేశారు. 10లో▸

కార్తీక వైభవం

కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకవజామునుంచే ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు మొక్కుకున్నారు. దీపాల వెలుగుల్లో ఆలయాలు కాంతులీనాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.





మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మంచాల: బుగ్గరామలింగేశ్వర స్వామి దర్శనం కోసం కిక్కిరిసిన భక్తులు



చేవెళ్ల: కొనగట్టు శివాలయం ఆవరణలో ప్రమిదలు వెలిగిస్తున్న భక్తులు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ శివాలయంలో..

క్రీడ.. ఏదీ జాడ?

సాక్షి పరిశీలన

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- కనిపించని క్రీడా పరికరాలు
- కొరవడిన నిర్వహణ
- రూ.లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం
- ఆటలకు దూరంగానే క్రీడాకారులు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని.. క్రీడలకు పెద్దపీట వేయాలని.. ఆటలతో ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో పల్లెల్లో ఆర్భాటంగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గ్రామానికొకటి కేటాయించి.. ఈ మేరకు రూ.లక్షల్లో నిధులు మంజూరు చేసి మైదానాలను సిద్ధం చేశారు. ఆ తర్వాత వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మైదానాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ప్రహరీలు లేక.. క్రీడా పరికరాలు కనిపించక అలంకారప్రాయంగా మిగిలాయి. ఫలితంగా గ్రామీణ క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు.

‘పేరు’కు మాత్రమే..

షాబాద్: మండలంలో క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. మాచన్‌పల్లి, చర్లగూడ, షాబాద్, కుర్వగూడ గ్రామాల్లో బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ప్రహరీలు నిర్మించలేదు. అందులో క్రీడా పరికరాలు లేవు. కొన్ని చోట్ల ఈ ప్రాంగణాలు పశువులను కట్టేసేందుకు వినియోగిస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి క్రీడా ప్రాంగణాలు నిర్మించినా ఉపయోగం లేకుండా పోయింది.

అందుబాటులోకి తేవాలి



మా గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం పిచ్చి మొక్కలతో నిండి పోయింది. వాటిని తొలగించి, చుట్టూ ప్రహరీ నిర్మించి, క్రీడా పరికరాలు అందుబాటులోకి తెస్తే యువతకు ఆడుకునేందుకు ఉపయోగపడుతుంది. యువకులు మంచి క్రీడాకారులుగా ఎదుగుతారు.

– కూతురు మహేందర్, మాచన్‌పల్లి



మాచన్‌పల్లిలో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న క్రీడా ప్రాంగణం

నిర్వహణ లేక నీరుగారిన లక్ష్యం



మన్సాన్‌పల్లి చౌరస్తాలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

మహేశ్వరం: మండలంలోని మొత్తం 30 పంచాయతీల్లో 30 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అంతా బాగానే ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వాటి నిర్వహణ ఆయా గ్రామాల్లో అధ్వానంగా మారింది. బోర్డులు ఏర్పాటు చేసి వదిలేయడంతో పలు చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఊరికి దూరంగా ఉండడంతో ఆడుకునేందుకు యువకులు, క్రీడాకారులు, విద్యార్థులు ముందుకు రావడం లేదు. నిర్వహణ పూర్తిగా కరువవడంతో క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి అధ్వానంగా మారాయి. నిర్వహణ సక్రమంగా చేపట్టి క్రీడాకారులు ఆడుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాలకు చెందిన క్రీడాభిమానులు కోరుతున్నారు.

నిరుపయోగం.. ఆటలకు దూరం



గట్టుప్పలపల్లిలో వృథాగా క్రీడా ప్రాంగణం

తలకొండపల్లి: ఆయా గ్రామాల్లో స్థల సమస్య, సరిపోను భూమి లభ్యం కాకపోవడంతో మండల వ్యాప్తంగా 32 పంచాయతీలకు గాను 12 చోట్ల మాత్రమే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ ప్రహరీలు మాత్రం నిర్మించలేదు. ఎలాంటి క్రీడలు నిర్వహించక నిరుపయోగంగా ఉన్నాయి. సమస్యలు పరిష్కరించి అన్ని చోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని, ఉన్నవాటిని వినియోగంలోకి తేవాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. క్రీడల్లో మెలకువలు నేర్పించాలని, పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను గుర్తిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందంటున్నారు.



చేవెళ్ల మండలం పామెనలో గ్రామానికి దూరంగా ఉన్న క్రీడా ప్రాంగణం

గ్రామాలకు దూరంగా క్రీడాప్రాంగణాలు

చేవెళ్ల: మండలంలోని మొత్తం 37 పంచాయతీలకు గాను 24 చోట్ల గత ప్రభుత్వ హయాంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇంకా 13 పంచాయతీల్లో అనువైన స్థలాలు లేకపోవడంతో ఏర్పాటు చేయలేదు. క్రీడాపాంగణాలు ఏర్పాటు చేసి ఆడుకునేందుకు కావాల్సిన స్పోర్ట్స్ మెటీరియల్ ఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రతి పంచాయతీకి అందజేశారు. నిర్వహణ కరువై మైదానాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో వీటిని ఉపయోగించే వారు లేక పిచ్చిమొక్కలు మొలిచాయి. తాగుబోతులకు అడ్డాగా మారుతున్నాయి. చాలా గ్రామాల్లో మైదానాలు దూరంగా ఉండడంతో ఉపయోగించుకోలేక పోతున్నట్లు యువకులు చెబుతున్నారు. వచ్చిన స్పోర్ట్స్ మెటీరియల్‌తో ఖాళీ స్థలాల్లో ఆడుకుంటున్నారు. గ్రామాల్లో ప్రహరీల నిర్మాణం లేకుండానే చుట్టూ మొక్కలు నాటి వదిలేశారు. తరచూ క్రీడా పోటీలు నిర్వహిస్తే ఈ మైదానాలను ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి పంచాయతీకి ఒక క్రీడాప్రాంగణం ఉండాలనే ఆలోచనతో గత ప్రభుత్వంలో వీటిని ఏర్పాటు చేయడం జరిగింది. నిర్మించి పంచాయతీలకే నిర్వహణ అప్పగించాం. స్పోర్ట్స్ మెటీరియల్ సైతం ఎన్ఆర్ఈజీఎస్ కింద అందించాం. గ్రామాల్లో యువత, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– విఠలేశ్వర్‌జీ, ఎంపీడీఓ, చేవెళ్ల

అధ్వానం.. పట్టని అధికారగణం

యాచారం: మండల పరిధిలోని చింతుల్ల, అయ్యవారిగూడెం, తదితర గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా దర్శనమిచ్చాయి. గ్రామాలకు కిలోమీటర్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో యువతీయువకులు అక్కడికి వెళ్లడం లేదు. క్రీడా ప్రాంగణాల్లో చెట్లు, గడ్డి మొలిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని ప్రాంగణాల్లో బిగించిన సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు.

చదును చేసి.. వదిలేసి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి పెద్ద చెరువు వద్ద క్రీడా ప్రాంగణం కోసం గత సంవత్సరం మున్సిపల్ అధికారులు దాదాపు ఐదెకరాలు కేటాయించారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఒకేచోట (మల్టీపర్పస్) కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, టెన్నిస్‌తో పాటు పలు రకాల క్రీడల కోసం ప్రత్యేకంగా కోర్టులను నిర్మించేందుకు నిర్ణయించారు. మైదానాన్ని చదును చేయడంతో పాటు చుట్టూ ప్రహరీ, రెండువైపులా గేటు నిర్మించడం తప్పితే మిగతా పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి.



మీర్‌పేటలో క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన స్థలం

ఆటలు లేక వెలవెల



నెర్రపల్లిలో వెలవెలబోతున్న క్రీడా ప్రాంగణం

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని 14 పంచాయతీల్లో 10 చోట్ల క్రీడా ప్రాంగణాలను నిర్మించారు. ప్రభుత్వ భూములు, పార్కు స్థలాల్లో అట్టహాసంగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో నాలుగు గ్రామాల్లో నిర్మించలేదు. ఎకరాలో ఒక్కో క్రీడా ప్రాంగణం కోసం రూ.70 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు కేటాయించారు. నిర్మాణం చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు వాటిలో ఆటలు ఆడిన దాఖలాలు లేవు. ప్రహరీలు లేకపోవడంతో ఆట స్థలాలకు కనీసం రక్షణ లేకుండా పోయింది. క్రీడా ప్రాంగణాలన్నీ వెలవెలబోతున్నాయి. లక్ష్యం బాగున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

చల్లంగ చూడు.. మైసమ్మ తల్లి

భక్తిశ్రద్ధలతో మైసిగండి మైసమ్మ జాతర షురూ



మైసమ్మ తల్లికి క్షీరాభిషేకం చేస్తున్న వేదపండితులు

కడ్తాల్: మైసిగండిలో కొలువైన మైసమ్మ తల్లి జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి తొలి రోజు క్షీరాభిషేకం, విశేష అలంకరణలు, కుంభహారతి సేవలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చల్లంగా చూడమ్మ మైసమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈవో స్నేహలత, తహసీల్దార్ జ్యోతి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న అమ్మవారి ఆలయం

అన్నీ చెప్తే రేషన్ కార్డులు పోతాయా సార్

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని ప్రశ్నించిన ప్రజలు



చిలుకూరులో ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఆకునూరి మురళి

మొయినాబాద్: ‘ఇంటింటికీ వచ్చి అన్ని వివరాలు అడుగుతున్నారు.. అన్నీ చెప్తే మా రేషన్ కార్డులు పోతాయా సార్’ అంటూ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని ప్రజలు ప్రశ్నించారు. మండల పరిధిలోని చిలుకూరులో సమగ్ర కుటుంబ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంటింటి సర్వే చేస్తున్న విధానం.. ఎన్యుమరేటర్స్ అడిగే ప్రశ్నలకు ప్రజల నుంచి వస్తున్న సమాధానాల తీరును ఆరా తీశారు. నేరుగా ప్రజలతో మాట్లాడి సర్వేలో అడుగుతున్న అన్ని వివరాలను తెలియజేస్తున్నారా అని ప్రశ్నించారు. అన్ని వివరాలు చెబుతున్నాం.. మా రేషన్ కార్డులు ఉంచుతారా తీసేస్తారా సార్ అని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. దీంతో ఆయన వాటిని నోట్ చేసుకున్నారు. ఎన్యుమరేటర్స్‌తో మాట్లాడి సర్వే చేయడం ఎలా ఉంది.. ఒక్కో ఇంటి వద్ద ఎంత సమయం పడుతుంది.. ప్రజల నుంచి ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా.. అడిగిన అన్ని ప్రశ్నలకు ప్రజలు సరైన వివరాలు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువులోగా సర్వే పూర్తి చేయాలని, అన్ని వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

గిరిజన బతుకులతో చెలగాటం తగదు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్



విలేకరులతో మాట్లాడుతున్న రాంబల్ నాయక్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద గిరిజన బతుకులతో చెలగాటం ఆడుతోందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్ నాయక్ అన్నారు. పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తాము భూములు ఇవ్వమని గిరిజనులు చెబుతున్నా బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఫార్మా సిటీ ఏర్పాటు కోసం భూములిచ్చేందుకు అక్కడి రైతులు సిద్ధంగా లేరన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు కలెక్టర్ ఎలాంటి భద్రత లేకుండా వచ్చారని అన్నారు. లగచర్లలో అధికారులుపై ఎవరో దాడి చేస్తే అమాయకులైన గిరిజనులను అక్రమంగా అరెస్టు చేసి జైలు పంపించడం సరికాదన్నారు. దుద్యాల మండలంలోని ఆరు గ్రామాలు, తండాల్లో భయంకరమైన వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి తండాలు, గ్రామాలకు ఎవరినీ వెళ్లనీయకుండా పోలీసులు పికెటింగ్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. గతంలో ఇందిరమ్మ రాజ్యంలో నాటి ప్రభుత్వం గిరిజనులకు భూములు ఇస్తే, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూములను గుంజుకుంటోందని దుయ్యబట్టారు. దళిత, గిరిజనులు, అమాయక రైతుల భూములు బలవంతంగా లాక్కొని పరిశ్రమలు నిర్మిస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. దళిత, గిరిజన బతుకులతో చెలగాటం మానుకోవాలని.. ఫార్మాసిటీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చందర్ నాయక్, చందు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ పునరుజ్జీవానికి వ్యతిరేకం కాదు

- ప్రజలను పెడుతున్న ఇబ్బందులు, దోపిడీకే వ్యతిరేకం
- సీఎం రేవంత్‌రెడ్డి సవాలును బీజేపీ స్వీకరిస్తోంది
- నేడు మూసీ పరివాహక కాలనీల్లో కేంద్ర మంత్రులు, ఎంపీల బస
- పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి


ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: మూసీ పునరుజ్జీవానికి బీజేపీ వ్యతిరేకం కాదని, దీన్ని అడ్డం పెట్టుకుని రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను పెడ్తుతున్న ఇబ్బందులు, దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సునీతారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలను అమలు చేయలేక.. ప్రజల దృష్టిని మళ్లించేందుక హైడ్రా, మూసీ పునరుజ్జీవం అంటోందని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఒక పూట బస చేసి చూడూ అని సీఎం రేవంత్‌రెడ్డి.. ఎంపీ ఈటల రాజేందర్‌కు విసిరిన సవాలును తమ పార్టీ స్వీకరిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, పార్టీ ముఖ్యనాయకులు శనివారం సాయంత్రం 4నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు బస చేయనున్నట్లు వెల్లడించారు. చైతన్యపురి డివిజన్ పణిగిరికాలనీలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బస చేస్తారని ప్రకటించారు.

గిరిజన అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


క్రీడాకారులకు ప్రశాంసాపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీటీడీవో రామేశ్వరీదేవి

కడ్తాల్: గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం గిరిజన వీరుడు ధర్తిఆబా భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సందేశాన్ని వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల కోసం వెల్దండలో ఏకలవ్య గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గంలో సుమారు 45 వేల మంది గిరిజనులు ఉన్నారని, వీరిలో చాలా మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలు, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. డీటీడీవో రమాదేవి మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయని తెలిపారు. అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి, ఉత్తమ పీడీ మంజులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతిమణి మాధవి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, ఏటీడీవో వెంకటయ్య, ట్రైకార్ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


గుర్తు తెలియని మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం షాద్‌నగర్‌లో వెలుగు చూసింది. పోలీసుల కథకం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ శివారులోని బైపాస్ జాతీయ రహదారి సమీపంలో బుచ్చిగూడ రోడ్డు పక్కన సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న ఓ గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది పడి ఉన్నాడు. రోడ్డు గుండా వెళుతున్న కావలి రమేశ్ శవాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. అయితే మృతుడి కళ్లు, కాళ్లపై గాయాలు ఉన్నాయి. మృతదేహం సమీపంలో ద్విచక్రవాహనం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా యువకుడిని హత్య చేసి బైక్‌పై తీసుకొచ్చి పడేశారా, లేదంటే ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి మృతి చెందాడా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ బల్‌రాం తెలిపారు.

పండుగపూట ఇంటికి వెళ్తుండగా..

రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ మృతి


బాల్‌రాజ్ మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన ఓ మేస్త్రీ మృతి చెందిన సంఘటన షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సత్యహళ్లి గ్రామానికి చెందిన చుక్క బాల్‌రాజ్ (42) హైదరాబాద్‌లో గృహ నిర్మాణ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా బాల్‌రాజ్ తన ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో షాద్‌నగర్ పరిధిలోని చటాన్‌పల్లి జాతీయ రహదారి బైపాస్‌పై వెనుక నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాల్‌రాజ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతురాలి భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నిమ్స్‌లో నేటి నుంచి నైపుణ్య అవగాహన సదస్సు



లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో మైక్రో సర్జరీ, మైక్రోవాస్క్యులర్‌లపై జోన్ స్థాయిలో ప్రత్యేక అవగాహన నిర్వహించనున్నట్టు శుక్రవారం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమల్ ఎర్రగుంట తెలిపారు. న్యూరాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహించే ఈ కార్యక్రమం నిమ్స్‌లో శనివారం నుంచి రెండు రోజులపాటు జరుగుతుందన్నారు. దేశంలోని ప్రముఖ న్యూరోసర్జన్లు పాల్గొంటారు. బ్రెయిన్ బైపాస్ సర్జరీలు నిర్వహించడానికి అత్యవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. సదస్సులో న్యూరోసర్జన్‌లు వంశీ కృష్ణ, సుచంద భట్టాచర్య, మానస్ పాణిగ్రాహి, కృష్ణ శ్రీధర్ తదితర నిపుణులు పాల్గొంటారని డాక్టర్ తిరుమల్ వివరించారు.

ఆ చట్టాలను రద్దు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

కందుకూరు: నరేంద్రమోదీ పాలనలో రైతు, కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి పొట్టగొట్టే ప్రయత్నం చేస్తున్నారని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి విమర్శించారు. రైతు, కార్మిక వ్యతిరేక నూతన చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక జిల్లా కమిటీల నాయకులు దుబ్బాక రాంచందర్, పెరుమాండ్ల అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని పాషా నరహరి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ.. నల్ల చట్టాలపై గత సంవత్సరం పెద్ద ఎత్తున లక్షలాది మంది రైతులు దేశ రాజధానిని చుట్టుముట్టి ఆందోళనలు చేశారన్నారు. ఆ సమయంలో గడ్డకట్టే చలిలో 750 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. తమ పోరాటంతో చివరకు మోదీ ప్రభుత్వం మెడలు వంచారన్నారు. అప్పట్లో తాత్కాలికంగా ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటించి, మళ్లీ అమలుపరిచేలా ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి అన్నదాతల నడ్డి విరిచే ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రశేఖర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. 56 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికులకు కనీసం సమ్మెలు, పోరాటాలు చేసే హక్కు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గ్రామిక మహిళా కన్వీనర్ కవిత, జిల్లా నాయకుడు కీసరి నర్సిరెడ్డి, వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.కుమార్, రైతు సంఘం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, జిల్లా నాయకులు స్వప్న, టి.నరసింహ, బుగ్గ రాములు, ఎల్లేష్, రైతు నాయకులు తావునాయక్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: త్వరలో జరగబోయే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు హరిభూషన్ పటేల్ ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య హాజరై మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగింపు దశకు చేరుకుందని అన్నారు. నాయకులు, కార్యకర్తలు అన్ని పోలింగ్ బూతుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు నాయకులు తగిన విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు నర్సింహగౌడ్, మహేందర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్, వెంకటేష్, బాల్‌రెడ్డి, నర్సింహ, మోహన్‌సింగ్, ప్రవీణ్, బాల్‌రాజ్, రామకృష్ణ, రంగన్న, ఆంజనేయులు, విజయ్, ఎం.విజయ్, శివ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్పెంటర్ మృతి


డాగ్ స్క్వాడ్‌తో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్ గౌడ్

శంకర్‌పల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన శేఖర్ (40) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. తండ్రి బాలరాజు 12 ఏళ్ల క్రితం ఇల్లు వదిలి వెళ్లగా.. తల్లి లక్ష్మి రెండేళ్ల క్రితం మరణించింది. అన్న ఆంజనేయులు మెదక్ జిల్లా నర్సాపూర్‌లో కార్పెంటర్ దుకాణం నిర్వహిస్తుండగా శేఖర్ అక్కడే పని చేసేవాడు. నాలుగు రోజుల క్రితం తల్లి సంవత్సరీకం ఉందని చెప్పి పటాన్‌చెరులో ఉండే అక్క కల్పన ఇంటికి వచ్చాడు. మూడు రోజుల క్రితం అక్కడ నుంచి శంకర్‌పల్లికి వచ్చి పట్టణ శివారులో శవమై తేలాడు. శుక్రవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్యం తాగి, బహిరంగ మలవిసర్జనకు వచ్చిన క్రమంలో ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా హరికిరణ్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా చెవ్వూరు హరికిరణ్ శుక్రవారం అబ్కారీ భవన్‌లో బాధ్యతలను చేపట్టారు.2009 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఏపీలో నెంబర్ వన్ రాంకర్ గాను, జాతీయస్థాయిలో 18వ రాంకర్‌గా నిలిచారు.శిక్షణ అనంతరం వైఎస్సార్ కడప, ఈస్ట్‌గోదావరి జిల్లాల కలెక్టర్‌గా బాధ్యతలను నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ అయ్యారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అబ్కారీ భవన్‌లో ఏఈఎస్ శ్రీనివాస రావు,తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

టార్గెట్.. నవ ఓటర్!

- వచ్చే నెల 24 వరకు అభ్యంతాల స్వీకరణ, పరిశీలన
- జనవరి 6న తుది ఓటరు జాబితా వెల్లడి
- గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 1.12 కోట్లు

ఈ నెల 28 వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నూతన ఓటరు నమోదుకు, తప్పులు దొర్లినా, పేరు లేకున్నా, ఇంకా ఇతరత్రా వాటికి ఫారం-8, పేరు తొలగించేందుకు ఫారం-7 దరఖాస్తులు అందించేందుకు స్థానిక తహసీల్ కార్యాలయాల్లో ఈ నెల 28 వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. అభ్యంతరాలను డిసెంబరు 24 వరకు పరిశీలించి.. జనవరి 6 వరకు తుది ఓటరు జాబితాను వెల్లడించటానికి ఆయా జిల్లాల ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోంది.

18 ఏళ్లు నిండితే..

పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ముమ్మరంగా సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన యువతీ యువకులు తమ ఓటును నమోదు చేసుకునేలా.. ఓటు హక్కు ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఆయా జిల్లాల ఎన్నికల కమిషన్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న జాబితాలో మరణించిన వారి పేర్ల తొలగింపు, తప్పుల సవరణకు ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పిస్తోంది. గ్రేటర్ సహా శివారు జిల్లాలలో కార్యక్రమాలు కొనసాగుతుండటంతో వీటిని నిత్యం సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు. యువ ఓటరు నమోదు లక్ష్యంగా శని, ఆదివారాల్లో దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాలను జోరుగా నిర్వహించారు.



ప్రత్యేక కార్యక్రమాలతో ముందుకు..

- గ్రేటర్ సహా శివారుల్లోని 28 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అయిదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు శివారు జిల్లాల్లోని 29 పురపాలిక సంఘాలు ,గ్రామ పంచాయతీల్లో స్వీప్ కార్యక్రమాలను సంబంధిత అధికారులు చేపడుతున్నారు. ఇటీవల ప్రకటించిన ఓటరు తుది జాబితా ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో మొత్తం 1,12,14,168 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 57,45,342 పురుష ఓటర్లు ఉండగా, 54,68,052 మహిళా ఓటర్లు, ఇతరులు 774 మంది ఉన్నారు. నూతన ఓటర్ల నమోదుకు అధికార యంత్రాంగం ప్రత్యేకంగా సన్నాహాలు చేపడుతోంది. ఇప్పటికే ఆయా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతుండటంతో పాటు ప్రత్యేకంగా ఫారాలు అందజేస్తుండటంతో అభ్యర్థులు ఓటు నమోదు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా నమోదు నిర్వహించారు.

ప్రస్తుతం ఓటర్ల వివరాలు ..

జిల్లా	ఓటర్లు
హైదరాబాద్	46,22,133
రంగారెడ్డి	36,51,513
మేడ్చల్-మల్కాజిగిరి	29,40,522
మొత్తం	1,12,14,168

అవగాహన కార్యక్రమాలు ఇలా..

ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి, జిల్లా ఉపాధి అధికారులు క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు శిబిరాల నిర్వహణతోపాటు గ్రామాల్లో ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతోపాటు కొత్తగా వివాహం చేసుకున్న వివాహితులకు ఓటు నమోదు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంటర్ కళాశాలల్లో, పాఠశాలలతోపాటు స్వీప్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పట్టణాలు, గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. పురపాలికల్లో, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, 2కె రన్, మానవహారం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.